క్లుప్తంగా

కేటాయింపులు పెంచాలి



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : గృహ నిర్మాణాల కోసం లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు జె.రామాంజనేయులు, రైతుసంఘం మండల నాయకుడు యు.హనుమంతరెడ్డి కోరారు. పాండవగల్ గ్రామంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో కలిసి సచివాలయానికి వెళ్లి సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం కోసం ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడం లేదన్నారు. లబ్ధిదారులు ఈరన్న, తాయప్ప, అనంత లక్ష్మయ్య, ఈరమ్మ, రంజాన్,ఎల్లాగౌడ్, భాస్కర్, తిక్కయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మంగళూరు జట్టు



విజేతలతో పోటీల నిర్వాహకులు

కోసిగి: మండలంలోని కొల్మాన్‌పేట గ్రామంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో కర్ణాటక రాష్ట్రం మంగళూరు జట్టు విజేతగా నిలిచింది సోమవారం గ్రామంలో మారెమ్మ దేవి ఆలయం సమీపంలో నిర్వహించిన ఫైనల్ పోటీలో మంగళూరు, కొల్మాన్‌పేట జట్లు పోటీ పడ్డాయి. విజేత జట్టుకు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గులిగేని హనుమంతు,ఉప్పపాటి అర్జున్ నగదు అందజేశారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు.

వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ఆదోని రూరల్ : స్వచ్ఛభారత్(గ్రీన్ అంబాసిడర్స్) కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, మండల ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు తిక్కప్ప కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు సుమారు సంవత్సరానికి పైగా వేతనాలు ఇవ్వకపోతుండటంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే జీవో నంబర్ 680 ప్రకారం రూ.10 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.6 వేలు మాత్రమే ఇవ్వడం సమంజసం కాదన్నారు. కార్మికులు హనుమంతు, రామాంజనేయులు, నరసప్ప, నరసింహయ్య పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పలు లాడ్జీల్లో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా బస చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో కర్ణాటక ఆర్టీసీ బస్సుల్లో సోదాలు చేపట్టారు. అలాగే తుంగభద్ర నది తీరంలో కుడా తనిఖీలు చేపట్టి అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, బైక్

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ ప్రహ్లాద తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. 17 బాక్సుల్లో 1,632 టెట్రా ప్యాకెట్లు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గురజాలలో కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నందవరం: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గురజాలలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. సోమవారం పోటీలు ప్రారంభించగా 28 జట్లు పోటీలో పాల్గొన్నాయి. మొదటి రోజు 10 జట్లు విజయం సాధించాయి. మంగళవారంతో పోటీలు ముగియనున్నాయి. సర్పంచ్ వీరస్వామి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుపుతున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

- నాడు–నేడుతో ప్రభుత్వ ఆసుపత్రులకు మహర్దశ
- వసతులతో పాటు, నూతన పరికరాలను సమకూరుస్తున్న సర్కారు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆపద వస్తే జిల్లా కేంద్రాలకు పరుగులు తీయకుండా పట్టణంలోనే నాణ్యమైన, ఆధునిక వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేసి ఏరియా ఆసుపత్రి ఆవరణలో వంద పడకల భవనాన్ని నిర్మిస్తోంది. అలాగే మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అన్ని హంగులతో 50 పడకల భవన నిర్మాణం చివరి దశకు చేరింది. ఆధునిక యంత్ర పరికరాలు, వసతులు, వైద్యులు, సిబ్బందిని నియమించనుంది. త్వరలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.



ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిర్మాణంలో వంద పడకల ఆస్పత్రి భవనం



మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అన్ని హంగులతో నిర్మించిన 50 పడకల భవనం

ఆదోని టౌన్ : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఆసుపత్రులకు నూతన భవనాలు, వసతులు, ఆధునిక యంత్ర పరికాలు, వైద్యులు, సిబ్బందిని కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. పట్టణంలో రెండు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులతో నూతన భవనాలను నిర్మిస్తోంది. వీటిని ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు వేగంగా పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయితే.. చాలీచాలని వార్డులు, డాక్టర్లు లేక ఇబ్బందులు, పెచ్చులూడిపోయిన ఆస్పత్రి భవనాలు, బాత్‌రూమ్‌లు, లెట్రిన్‌లు, తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న రోగులు, డాక్టర్‌లు, సిబ్బందికి అవస్థలు తప్పనున్నాయి. డివిజన్ కేంద్రమైన ఆదోనిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ సెంటర్‌కు కాన్పులు, గర్భిణుల పరీక్షలు, తల్లీ, పిల్లల సంరక్షణ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, అఘాయిత్యాలకు పాల్పడిన, వాంతులు, విరేచనాలు, వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడేవారు. అయితే నూతన భవనాలు ప్రారంభమైతే, డాక్టర్ల పోస్టులు భర్తీ కానుండడంతో రోగుల ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది.

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో..

ఎంసీహెచ్ సెంటర్‌లో 50 పకడలు ఉన్నాయి. అయితే గర్భిణులు, బాలింతలు, పిల్లల సంరక్షణకు మెరుగైన వైద్యం అందించేందుకు గదులు చాలడం లేదు. రోగులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. వేసవి కాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. రోగుల ఇబ్బందుల దృష్ట్యా అదనంగా మరో 50 పడకల భవనాన్ని నిర్మించాలని నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద రూ.712 లక్షలను మంజూరు చేసింది. నూతన భవనంలో వార్డులు, ల్యాబ్, ఓపీ, చిన్నపిల్లల డాక్టర్లకు గదులు కేటాయిస్తూ నిర్మాణ పనులు పూర్తి చేశారు.

ఏరియా ఆస్పత్రిలో..

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో రూ.107 లక్షలతో వంద పడకలకు సంబంధించిన భవనాన్ని నాడు–నేడు కింద నాబార్డు నిధులతో నిర్మించారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో వంద పడకలు ఉన్నప్పటికీ రోగులకు చాలడం లేదు. డివిజన్‌లో దాదాపు 15 లక్షల జనాభాకు వైద్యసేవలు అందిస్తున్న భవనంలో వసతుల లేమి కారణంగా నూతన భవనాన్ని నిర్మించారు. మూడు అంతస్తులు, డాక్టర్స్ రూమ్స్, వార్డుల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఏప్రిల్‌లో ఈ భవనం అందుబాటులోకి రానుంది. దీంతో ఆదోని, పరిసర ప్రాంతాల్లోని రోగులు కర్నూలు, బళ్లారి, రాయచూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. కాగా..ఖాళీగా ఉన్న డాక్టర్, సిబ్బంది పోస్టులను ఇప్పటికే భర్తీ చేశారు.

వసతులు కల్పించడం హర్షణీయం



ప్రభుత్వ ఆస్పత్రిలో చాలీచాలని గదులు, సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వం ఆధునిక వసతులతో కొత్తగా భవనాలను నిర్మించడం, అందులో రోగులకు వార్డులు, డాక్టర్ల గదులను, ఓపీలు వంటి వసతులను కల్పించనుండటం హర్షణీయం.

– మల్లికార్జున, విక్టోరియాపేట,ఆదోని

త్వరలో అందుబాటులోకి..



వంద పడకల ఆస్పత్రి భవనం మరో రెండు, మూడు నెలల్లో రోగులకు అందుబాటులో రానుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భవనం ప్రారంభమైతే రోగులు, డాక్టర్లకు ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ లింగన్న, ఆదోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామి సమాధికి పూల చాదర్ సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ.. స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.సలామ్‌లా ఆలపన, ఖాదర్ లింగ స్వామి ప్రవచనలు ఆలపించారు.



తరలివచ్చిన భక్తులు

వైభవంగా భీరప్పస్వామి దేవర

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో భీరప్పస్వామి సోమవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు తుంగభద్ర నదిలో గంగపూజ నిర్వహించి పల్లకీలో కొలువైన స్వామి వారిని అశేష భక్త జనం మధ్య పారువేటగా గ్రామచావిడికి చేర్చారు. అక్కడి నుంచి ఆలయం వరకు కాలాటా, డోలు, స్వామి నామస్మరణ మధ్య ఊరేగింపు కనుల పండువగా సాగింది. మధ్యాహ్నం గ్రామస్తులు మొక్కుబడిలో భాగంగా కుంభోత్సవం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు అన్నదాన, తులాభారం కార్యక్రమం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు,ఆకుపూజతో అలంకరించి మహా మంగళ హారతులిచ్చారు. మసీదుపురం, కల్లుకుంట గ్రామాల భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.సీఐ శ్రీనివాసులు,ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : సొంత స్థలం ఉండి, ఇల్లు కట్టుకోవాలనుకుంటున్న వారు ఆలస్యం చేయకుండా వైఎస్సార్ హౌసింగ్ స్కీం కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సూచించారు. ప్రస్తుతం వైఎస్సార్ హౌసింగ్ స్కీంకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అయ్యిందని, వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సొంత స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకోవాలని ఆసక్తి ఉన్న, అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేసి, రుణసాయం అందజేస్తారని చెప్పారు. సోమవారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గత నాలుగైదు నెలలుగా ఆదోని మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించామని, ఇందులో ఎక్కువ శాతం మంది సొంత స్థలం ఉంది ఇల్లు మంజూరు చేయాలని కోరారని చెప్పారు. ప్రజల వినతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. నూతనంగా అమలు చేస్తున్న వైఎస్సార్ హౌసింగ్ స్కీం కింద దరఖాస్తు చేయించి వారికి ఇల్లు మంజూరు చేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భూకంప బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: భారీ భూకంపంతో సర్వం కోల్పోయిన టర్కీ, సిరియా దేశాల బాధితులకు కౌతాళం మండల అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ముస్లీం మైనార్టీ నాయకులు మండలంలోని ఆయా మసీదుల్లో విరాళాలు సేకరించారు. మొత్తం రూ. 52,120 పోగైంది. ఈ మొత్తాన్ని సోమవారం అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్‌కు అందజేశారు. సుభాన్ మాట్లాడుతూ మానవత్వ దృక్పథంతో భూకంప బాధితులకు ఆర్థిక సహాయం అందించిన మండల వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడు బాషా, టౌన్ కమిటీ అధ్యక్షుడు మహబుబ్‌బాషా, నాయకులు టైలర్‌బాషా, షేక్షావలి, యాసిన్, గౌస్‌పీర్, ఇస్మాయిల్, లడ్డు ఖాదర్, హఫ్వీ ఉసేన్‌బాషా, రఫీక్, ఇద్రుస్, ఇసాక్ పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఈరన్నస్వామి మూలవిరాట్

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యతో సెలవులు కలిసి రావడంతో తమ ఇంటి ఇలావేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలి వచ్చారు. ఆదివారం సాయంత్రం నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు.కొందరు స్థానికంగానే పిండివంటలు వండి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వేలసిన రామలింగేశ్వర దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శివరాత్రి వేడుకలతో పాటు అమావాస్య రావడంతో భక్తులు తరలివచ్చి రామలింగేశ్వరస్వామి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బుదుమలదొడ్డిలో..

సుళేకేరి గ్రామ శివారులో వెలిసిన బుదుమలదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రమణీయం.. సిద్దరూఢస్వామి రథోత్సవం



సర్కార్ కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



భక్తజనం మధ్య కదులుతున్న రథం

పెద్దకడబూరు : స్థానికంగా వెలసిన శ్రీ సిద్ధరూఢ స్వామి రథోత్సవం సోమవారం అశేష భక్తజనుల మధ్య రమణీయంగా సాగింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి కుంకుమార్చన, తులసీ అర్చన, బిల్వార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పిండి వంటలు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం నుంచి స్వామి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో కళశాలు, మేళ తాళలతో ఊరేగింపు తీసుకొచ్చి రథంపై అధిష్టింపజేశారు. అనంతరం గ్రామ పెద్ద రామలింగా రెడ్డి ఇంటి నుంచి సర్కార్ కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. శివనామ స్మరణతో భక్తజనుల కరతాళ ధ్వనుల మధ్య రథం ముందుకు కదిలింది. పెద్దబావి దగ్గర ఉన్న బసవన్న కట్ట దగ్గరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథోత్సవంలో మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రజలు అధిక సంఖ్యంలో పాల్గొనారు. సీఐ ఎరిషావలి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు వై.సీతారామిరెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, సింగిల్‌విండో అధ్యక్షుడు హనుమంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్రరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు, గ్రామపెద్దలు రామలింగా రెడ్డి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వై.సీతారామిరెడ్డి

వేడుకగా ఆంజనేయస్వామి పల్లకోత్సవం





ఆంజనేయ స్వామి వారికి పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం,పల్లకోత్సవంలో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: మండలంలోని ఏరిగేరి గ్రామ కొండల్లో వెలసిన శ్రీ పులిగట్టు ఆంజనేయస్వామి పల్లకోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రాత్రి 7గంటల సమయంలో కొండపై నుంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమం మంగళవారం ఉదయం పది గంటల వరకు గ్రామంలో కొనసాగుతుందని నిర్వహకులు తెలిపారు. ఉత్సవంలో పాల్గొనడానికి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర వంటి సుదూర ప్రాంతాలం నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు నాయకుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆలయ నిర్వహకులు స్వాగతం పలికి స్వామివారి సన్నిదిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ గోవిందు, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, నాయకులు వడ్డెరాము, తిక్కయ్య ప్రహ్లాద ఆచారి, రాఘవేంద్రరెడ్డి, నీలకంఠ రెడ్డి చౌదరి బసవ, ధర్మన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఇతర అధికారులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా అధికారులకు ఆదేశించారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. సోమవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. జాబితాలో డూప్లికేట్, అర్హత లేని వారికి ఓటు ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్‌లోని బ్యాలెట్ బాక్సుల భద్రతా, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తదితర అంశాలపై సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఫామ్–7, పట్టభద్ర నియోజకవర్గానికి సంబంధించి ఫామ్–8లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి 28వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎన్నిలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి 24 గంటల్లో పరిష్కారాలు చూపాలన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ మార్పు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. జిల్లాలోని పరిస్థితులను డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. జిల్లాలో ఓటర్ల దరఖాస్తులు పెండింగ్‌లో లేకండా చర్యలు తీసుకున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగరాజునాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఈడీ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

వైభవంగా శాంతియాత్ర



హొళగుందలో శాంతి ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: కుల మత భేదాలు వీడి ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని బ్రహ్మకుమారీలు భాగ్యమ్మ, లక్ష్మి అన్నారు. హొళగుందలో మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం ఓం శాంతి ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివ జయంతి శాంతియాత్ర జరిగింది. బ్రహ్మకుమారీలు భక్తి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా హొళగుందకు చెందిన పలువురు గ్రామపెద్దలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు వారి చేత ఓం శాంతి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేయించారు. అనంతరం గ్రామ పుర వీధులగుండా శాంతి యాత్ర నిర్వహించారు. చిన్నారులు వివిధ మతస్తుల వేషధారణతో ఆకట్టుకున్నారు.

వాస్తవ పరిస్థితులను మదింపు చేయండి

- డీటీలను ఆదేశించిన జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): భూ రీసర్వే సమయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను మదింపు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పీఓఎల్ఆర్ డీటీలతో రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు రీసర్వేను పూర్తి చేయడం కన్నా రైతుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మ్యూటేషన్లు, వారసత్వంగా వచ్చే భూములు, విక్రయాల ద్వారా సంక్రమించిన ఆస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి పీఓఎల్ఆర్‌ను చేపట్టాలన్నారు. డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలకు త్వరలోనే ఫొటో ఇమేజెస్ వస్తాయన్నారు. కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

శ్రీగిరిలో ప్రత్యేక పూజలు

ఆస్పరి: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని బిణిగేరి సమీపంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు వైద్యం రాజస్వామి, అనిల్ స్వామి, సంతోష్ స్వామి ఆలయంలో అభిషేకం, పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, లలిత హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.